## ఆణిముత్యాలు

# తరలి వెళ్లాము

## తురగా జానకీరాణి

రెండవ తరం కథా రచయిత్రులలో తురగా జానకీరాణి విశిష్టులు. నవలల ద్వారా లబ్ధప్రతిష్టులైన రచయిత్రులు మనకు యెక్కువగా వున్నారు. ఈమె కథా సాహిత్యంపైన దృష్టి సారించి, ఆధునిక వనిత మనోగతాన్ని తమ కథలలో చక్కగా ప్రతిబింబింప చేశారు. చక్కని కథనం వీరి స్వార్జితం తురగా కృష్ణమోహన్ గారి సహధర్మచారిణి. ఆకాశవాణి ద్వారా ఆమె వాణి తెలుగువారికి సుపరిచితం. "ఎర్రగులాబీలు" కథా సంకలనంలో జానకీరాణి కథాశైలి ప్రస్ఫుటం అవుతుంది. తాను ఆశించినది, అందినట్లే అంది జారిపోగా ఏకాకిగా మిగిలిన వనిత జీవితాన్ని యితివృత్తంగా అల్లిన కథ యిది. వీరి ప్రస్తుత నివాసం హైదరాబాదు.

"**బా**బూ, బాబూ, లెగవండి - మనమెల్లేసరికి తెల్లారి పోతది" అని పిలుస్తున్నారెవరో. మగతగా వున్న నాకు చటుక్కున మెలుకువ వచ్చింది. మేము పక్కలు వేసుకున్న అరుగుకి యివతల పందిట్లో పడుకున్నవాళ్ళు ఒకరిద్దరు కదిలారు. పడక్కుర్చీలోంచి ఎవరో లేచారు. శంకరమే! అతను లేచి, వళ్ళు విరుచుకున్నాడు బద్ధకంగా. పక్కనుంచి సన్నగా పడుతున్న దీపం వెల్తురులో, అతని ఆకారం అస్పష్టంగా కనుపించింది. అలిసిపోయినట్లుగా విదిలించాడు చేతులు. నా మనస్సు ఎవరో గుప్పిట పట్టినట్లు, ఏదో బాధ కలిగింది.

అంతా లేచారు. మరో గంటకి బయలుదేరాము. రెండు బళ్ళల్లో, సుమిత్ర వాళ్ళ తాతగారి వూళ్ళో, ఆ పల్లెటూళ్ళో చేస్తున్నారు పెళ్ళి. సుమిత్ర ఉత్తరం, ఆ పైన శంకరం వ్రాసిన నాలుగు వాక్యాల ఉత్తరం నన్ను రప్పించాయి యీ పెళ్ళికి. రగ్గు దగ్గరకు లాక్కుని బయటకు చూశాను నేను. మా ముందు నడిచే బండిలో ముగ్గురున్నారు. శంకరం ఉన్నాడు ఆ బండిలో.

లేత బూడిదరంగుగా వున్నదేమిటి యీ వెన్నెల? నా తల్లోని మల్లెపూలు. నా ప్రక్కనున్న బుట్టలోని విచ్చినపూలు గుండెలలో ఏమిటో కలవరింతలు కలిగిస్తున్నాయి. కలవరింతగా కాకి అరుస్తోంది. దారి పక్కన ఆకులు లేని చెట్లు, అస్పష్టమైన ఆకారాల్లో, గీతల్లాంటి కొమ్మలతో కనుపిస్తున్నాయి. నేను బాధగా కళ్ళు మూసుకున్నాను.

నాలుగేళ్ళ క్రితం - యీ వెన్నెల ఎంత మెరుస్తోంది: మిల మిల లాడుతూ లోకమంతా శోభతో నింపివేసిన వెన్నెల అది. జలతారు పట్టులోంచి జరీ పోగుల్లోంచి చూస్తున్నట్టు కనుపించాయి. ఆ బాట, ఆ మైదానం, ఆ కాలువ, ఆ రాత్రి నాకు, వెన్నెల రాత్రంతా యింకా ముందే ఉన్నదప్పుడు. వెండిలాగ మెరుస్తోంది వెన్నెల. చెట్లు మౌనంగా, చల్లగా కనుపిస్తున్నాయి.

ఆనాడు ముందు బండిలోంచి శంకరం పాటలు వినిపిస్తున్నాయి. నా కళ్ళు మూతలు పడసాగాయి. ఎడ్లు నడుస్తోంటే వాటి గిట్టల చప్పుడు, బండి చక్రం గరగరమని ఎండిన రేగటి గడ్డలమీద నడచిన చప్పుడు. వీటినిమించి ఎడ్ల మెడపట్టీలలోని పెద్ద

### 'రి'-యాక్షన్

**అ**మ్మాయి సుందరాంగే
అందం మరింత
మెరుగుకు
సలహా ఇచ్చా!
జులాయిలకి
ఎందుకో
ఉక్రోషం!!

-పాలెపు బాబు

మువ్వల చప్పుళ్ళు - ప్రశాంతమైన వెన్నెలలో, చలి చలిగా తియ్యగా వున్న వెన్నెలలో, ప్రశాంతతతో కలిసిపోయినాయి యీ శబ్దాలన్నీ. వీటిలోంచే శంకరం గొంతు వినిపించింది.

అంతకు మునుపు నెల రోజుల క్రితం ఎందుకు చెప్పాడు నాకు అవన్నీ? నిజంగా నా సలహా కావలి సేనా? కాలేజీ విడిచాక స్నేహితులు కొరవడ్డ అతనికి అన్నీ చెప్పుకోవడానికి నేను దొరికానేమో! లేక తన మనస్సులో సుశీలను చేసుకోవాలని ఉన్నప్పటికీ, మరొకళ్ళు కూడా చెబితే బాగుంటుందనుకున్నాడేమో! ఏమో! ఎడ్ల మెడలలోని గంటలు "ఔను, ఔను" అన్నట్లు మ్రోగినట్లనిపించాయి.

ఆనాడు- శంకరం కంఠం టెలిఫోనులో నన్ను పలుకరించింది. "మధ్యాహ్నం వచ్చాను వూళ్ళోకి. ఇంటర్వ్యూ వుంది రేపు" అని చెప్పాడు. హాస్టలుకి రమ్మన్నాను అతన్ని.

"ఈ వేళ రాను. ఎంతైనా పరీక్షకదా! రేపు సాయంత్రం వస్తా. బయటికి ఎక్కడికైనా వెడదాం. పర్మిషను తీసుకో" అన్నాడు.

సరేనని నేను ఫోను పెట్టేశాను. చిన్నప్పుడు ఏమంత చనువు లేకపోయినా శంకరం బెనారస్ నుంచి తిరిగి వచ్చాక, బాగా పరిచయం ఏర్పడింది నాకు. క్రిందటి వేసవి సెలవుల్లో నేను మా వూరు వెళ్లడం, దోవలో శంకరం వాళ్లింట్లో అనుకోకుండా పది, పది హేను రోజులుండటం జరిగింది. ఆ రోజుల్లోనే మా బంధుత్వం స్నేహంగా మారింది.

"ఏమైంది పరీక్ష?" అనడిగాను చిరునవ్వుతో మర్నాడు సాయంత్రం.

"జరిగిపోయింది- పోదామా బయటికి? ఈ కోటగోడల మధ్య నాకు తోచదు" అన్నాడతను.

మరో పావుగంటకి, సముద్రం దగ్గర వున్నాము. ఇసుకలో మెల్లిగా అడుగులు వేస్తున్నాడతను. కొంచెం ఆగి జేబులోంచి రుమాలు తీసి, కళ్ళజోడు తుడిచి పెట్టుకున్నాడు. రుమాలు మెడకి చుట్టుకుంటూ నా వేపు చూశాడు.

"కూర్చుందామా, అల్లా నడుద్దామా?" అన్నాడు.

"నీ యిష్టం" అన్నాను నేను. అతనక్కడే కూర్చున్నాడు. ఎగిరిపోతున్న బెలూన్లు పట్టుకోవడానికి పరిగెత్తుతున్నారు పిల్లలు.

"నీతో ఒక ముఖ్యమైన విషయం మాట్లాడాలను కున్నాను" అన్నాడతను. అతని కంఠం సీరియస్‌గా వినిపించింది. ఎందుకని క్రొత్తగా వుంది అంతా నాకు? నిన్న అతని కంఠం ఫోన్‌లో వినపడినప్పట్నించీ క్రొత్త గానే వుంది.

"చెప్పు" అన్నాను. అతను వెంటనే ఏమీ అనలేదు. కొంచెం ఆగి, "నీకు తెలుసేమో కదూ: అమ్మా, నాన్న నన్నో యింటివాణ్ణి చేయాలని తాపత్రయ పడుతున్నా రని" నేను తలూపాను. తలవంచి ఇసుకలో చూపుడు వ్రేలితో గీతలు గీయసాగాను. మళ్ళీ మౌనం వహించా డతను. నాతో మాట్లాడవలసిందేమిటి అన్న ప్రశ్న నాలోపలే ఆడుతోంది. జవాబు వినాలంటే భయం భయంగా వుంది.

"మీ సుశీల విషయంలో నీ అభిప్రాయమేమిటి?" అన్నాడతను. ఒడ్డు వరకు వచ్చి విరిగిన కెరటంలా ఫీలయ్యాను ఒక్క క్షణం పాటు. ఆ తరువాత ఉరుకు లతో, పరుగులతో పఱచుకుంటున్న నీటిలాగా నా ఆలోచనలు సాగాయి.

"సరిగ్గా వారం క్రిందట మీ మామయ్యే యీ ప్రసక్తి

## నాగిశెట్టి నానీలు

అనుబంధపు వారధి
కుప్పకూలింది
కల్తీ ప్రేమతో
కట్టారేమో

మీటగానే
సురాగాలు పలుకుతోంది
బిగుతుతీగలో
ఎంత వినయం?

నెత్తురు తాగి
రోగాన్నిస్తోంది
మురుగుజీవికేమి తెలుసు
పరోపకారం

మనిషిని తవ్వితే
మిశ్రమ ఫలితం
తెలుసుగా,
క్షీర సాగర మథనం

గతం బాధను
పాతిపెట్టు
భావి బతుక్కి
ఎరువు అవుతుంది.

-నాగిశెట్టి

తీసుకు వచ్చారు. సుశీల చాలా అమాయకురాలని అంతా అనుకుంటుంటే విన్నాను - నాలాంటి గడుసు వాడితో వేగగలదా అని నా సందేహం." అతను తేలిగ్గా నవ్వాడు యీ మాట అని. నేను తప్పనిసరిగా నవ్వాను.

"మరేమీ ఫరవాలేదులే. ఈడూ జోడూ సరిపో తుందిలే" అన్నాను నేను.

చీకటి పడేవరకు అక్కడే ఉన్నాము. అతను ఎన్నో సంగతులు చెప్పాడు. తన మనస్సు ఎన్ని విధాల, ఎన్ని వేపుల మ్రొగ్గుతున్నదీ చెప్పాడు. అన్నిటికీ "ఊ" అనో, "ఆ" అనో సమాధానాలిచ్చాను నేను. ఆనాటి సంగతి అది.

అప్పుడు సుశీలకి, శంకరానికి పెళ్ళి అయితే ఆనాడు అంతా తరలి వెళ్లాము. నేనూ వెళ్ళాను. శంకరం ఒక యింటివాడైనాడు.

...కలలా గడిచిపోయిన నాలుగు సంవత్సరాల తర్వాత, ఎన్నో మార్పులు జరిగిన తర్వాత... "మా యింటికి వస్తావా? పిక్చర్‌కి వెడదాం" అని ప్రపోజలు. సరేనన్నాను.

సినిమా హాలులో కూర్చున్న పదినిముషాలకి నా వేపు తిరిగిందామె. "నీతో ముఖ్యమైన సంగతి మాట్లా డాలని యిలా ప్రోగ్రాం పెట్టాను" అన్నది.

"సినిమాలోనా!"

"ఔను. ఈ చీకట్లో అయితే ఫ్రీగా మాట్లాడగలను నేను" అన్నదామె.

న్యూస్‌రీలు మొదలైంది. నా చేతిని ఆమె వ్రేళ్ళు గట్టిగా అదిమాయి. "సుశీల వాళ్ళ వదిన, అన్నయ్య వచ్చారు మా యింటికి. సుశీల పోయాక పిల్లవాడు వాళ్ళదగ్గరే వున్నాడు"... ఆమె హఠాత్తుగా తెచ్చిన యీ ప్రసక్తి క్రొత్తగా ఉంది. అయితే ఆమె ప్రస్తావించబోయేది కూడా చీకట్లో మిణుగురులా స్ఫురించింది నాకు. చాలా సేపువరకు ఎవరం మాట్లాడలేదు. తెరమీద అంతా ఏదో గొడవగా ఉంది నాకు. శంకరం ఎవరు, నేనెవరో! ఐతే నేనెందుకు ఉన్నాను యీ ప్రసక్తిలో?

"వాళ్ళ వదిన అడిగింది నన్ను... అతని విషయం. సుశీల పోయి ఏడాది తిరక్కుండా యీ మాట లేమిటన్నాను నేను." ఆగింది సుమిత్ర. తలవంచి కళ్లమీద చేతులుంచుకుంది ఆమె.

"కానీ... కొంచెం ఆలోచిస్తే, యిప్పుడే విపరీతంగా వంటరితనం అనిపిస్తుందేమో అతనికి. ఎంత బాధ నిజంగా! అతన్ని గురించి నీ అభిప్రాయం ఏమిటి?" అన్నది.

నేను వెంటనే జవాబివ్వలేదు. "నీకు కూడా పరిచయమేగా అతను! నేనేం చెప్పగలను" అన్నాను.

"అలాకాదు, నాకున్నది ముఖపరిచయమే. నీకు బంధుత్వం, స్నేహం కూడా ఉన్నాయి. నా మనస్సుని నువ్వే సమాధాన పఱచగలవు!" ఆమె కంఠం వణికింది.

"మంచివాడు సుమిత్రా అతను. అతనికి ప్రేమించే శక్తి ఉంది!" అన్నాను నేను. నేను అనవలసింది అదే కనుక అన్నాను.

పర్యవసానంగా యిప్పుడు- మరోసారి శంకరం, సుమిత్ర పెళ్లికి తరలి వెడుతున్నాము. వెన్నెలంతా ముందేవున్న మెరిసే రాత్రి కాదిది. మెరుపుపోయి, దిగులుగా, లేచీకటిలో తడిసిన, తెల్లవారు ఝామున కాసే వెన్నెలిది.

...నేను కళ్ళు మూసుకున్నాను. నా వెనుక నుంచి సన్నని చప్పుడు, కొండల మధ్య, చెట్ల మధ్య, జలజలమని ప్రవహిస్తున్న సెలయేరు చేసే చప్పుడు వినిపిస్తోంది. ఆ సెలయేరు నా వెనుక నుంచి వచ్చి, నా ప్రక్కగా నన్ను ఒరుసుకుంటూ, నా మీద తుప్పర్లు జల్లి అల్లా వెళ్లిపోయింది. నా ప్రక్కనుంచే మరో సన్నని కాలువ మంద మందంగా ప్రవహిస్తూ ముందుకు పోతూ, ఎక్కడో దూరంగా, నా చూపుకి అందని దూరంలో, ఆ సెలయేటిలో కలిసి పోతోంది.

నేను- నేను యిక్కడే, యీ గ్రుడ్డి వెన్నెలలో వంట రిగా ఉన్నాను.

■

## మలి అడుగు...

అమ్మ గొప్పదే కానీ
నాన్న తక్కువ వాడా?
అమ్మ ఒడి...
మమతల ఓడ!
నాన్న నీడనిచ్చే నీడ!
అమ్మ సెలయేరైతే...
నాన్న గంభీర సాగరం!
నడక నేర్పిన నాన్న
తడబడుతున్నాడేమి?
నాన్నా!
ఇక నేనే... నీ అడుగుని!

-దాస్యం సేనాధిపతి